రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పవర్ కట్

- మధ్యాహ్నం వరకు నిలిచిపోయిన సేవలు
- మరమ్మతులు చేపట్టక వృథాగా ఇన్వర్టర్

ఖలీల్‌వాడి, జూలై 16 : జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కావాల్సిన సేవలు మధ్యాహ్నం ఒంటి గంటైనా ప్రారంభంకాలేదు. దీంతో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చిన క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్యాలయంలో ఇన్వర్టర్ అందుబాటులో ఉన్నా అది చెడిపోయింది. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో మూలన వృథాగా పడిఉంది. ప్రభుత్వానికి అధిక ఆదాయం సమకూరే శాఖలో ఈ పరిస్థితి నెలకొనడం గమనార్హం. గతంలోనూ ఇదే సమస్య ఏర్పడిందని దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇబ్బందులు పడుతున్నామని రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు పేర్కొన్నారు.



విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకటి మయంగా కార్యాలయం

విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కార్యాలయంలో పడిగాపులు కాస్తున్న ప్రజలు

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రుణమాఫీ చేస్తున్నారా!

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కంఠేశ్వర్, జూలై 16: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రుణమాఫీ చేస్తున్నారా అని ఆ పార్టీ నాయకులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని రూరల్ క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలను కూలగొట్టిన చరిత్ర బీజేపీది అని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు తలా తోక లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రుణమాఫీ కేవలం పేద రైతులకే అని, ఎమ్మెల్యే, ఎంపీలకు కాదన్నారు. మోసం అంటే ఏంటో ఎంపీ అర్వింద్ చెప్పాలన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి మోసం చేసింది బీజేపీ కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడుగు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మున్సిపల్ అక్రమాలపై సీఎంకు ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్, జూలై16: మున్సిపల్ కార్యాలయంలో జరిగిన, జరుగుతున్న అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించినట్లు ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎంవో కార్యాలయంలో ఫిర్యాదు అందజేసినట్లు పేర్కొన్నారు.

పేకాటస్థావరపై పోలీసుల దాడి

- ఆరు సెల్ ఫోన్లు, రూ.20వేల నగదు స్వాధీనం

ఆలూర్, జూలై16: ఆలూర్ మండల కేంద్రంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులో తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణు మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. పేకాట స్థావరంపై మెరుపు దాడి చేసి ఏడుగురిని అదుపులో తీసుకోవడంతోపాటు వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, సుమారు రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో రవి కుమార్‌కు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై అంజమ్మ, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

లోన్ రికవరీ సొమ్ము స్వాహా

- డ్వాక్రా మహిళ లను బురిడీ కొట్టించిన బీసీ పాయింట్ మహిళ
- రూ.45 లక్షలను సొంతానికి వాడుకున్న వైనం
- కెనరా బ్యాంకు ఎదుట డ్వాక్రా సభ్యుల ఆందోళన
- ఆరు నెలల్లో చెల్లిస్తానని నోట్‌రాసిచ్చిన మహిళ

కల్లూరులో ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు

పొతంగల్, జూలై 16: బ్యాంకులో తీసుకున్న రుణాలకు సంబంధించిన కిస్తులను బ్యాంకులో చెల్లించకుండా ఓ మహిళ సొంతానికి వాడుకున్న ఘటన మండలంలోని కల్లూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోని కెనరా బ్యాంకు బీసీ పాయింట్ నిర్వహించే మహిళ..గ్రామంలోని డ్వాక్రా సంఘాల డిపాజిట్లు, రుణవాయిదాలను కట్టించుకునేది. కొత్తగా లోన్ కావాలని కొంతమంది డ్వాక్రా సంఘ సభ్యులు అధికారులను అడిగారు. పాత లోన్‌కు సంబంధించిన వివరాలు చూడగా..లోన్ డబ్బులు ఇంకా ముట్టలేదని సమాధానమివ్వడంతో మహిళలు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో రెండురోజులుగా బీసీ పాయింట్ మహిళ గ్రామంలో లేకపోవడంతో అనుమానం వచ్చిన డ్వాక్రా సీసీలు బ్యాంక్ స్టేట్‌మెంట్లను పరిశీలించారు. మహిళలు చెల్లించాల్సిన లోన్ డబ్బుల్లో నుంచి సగం మాత్రమే చెల్లించినట్లు గుర్తించారు. ఏడాది నుంచి సుమారు రూ.45 లక్షలు స్వాహా చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. విషయం తెలుసుకున్న మహిళలు మంగళవారం బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. డబ్బులు స్వాహా విషయమై బీసీ పాయింట్ మహిళను నిలదీయగా తానే తన బంధువుల ఖాతాలకు డబ్బులను మళ్లించినట్లు అంగీకరించింది. తాను రెండు విడుతలుగా డబ్బులు తిరిగి చెల్లిస్తానని అధికారులు, మహిళా సంఘాల సభ్యుల సమక్షంలో ఒప్పుకున్నది. ఆరు నెలల్లో మొత్తం చెల్లిస్తానని నోట్ రాసి ఇచ్చినట్లు ఏపీఎం బస్వంత్ తెలిపారు.

లారీని ఢీకొట్టిన కారు.. ఒకరి దుర్మరణం

- గాయపడిన ఆరుగురు.. క్షతగాత్రుల్లో ఇద్దరు చిన్నారులు

భిక్కనూరు, జూలై 16:జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు శివారులోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం తమ కారులో నిర్మల్‌కు బయల్దేరింది. అయితే, వారు ప్రయాణిస్తున్న కారు భిక్కనూరు మండలం సిద్దరామేశ్వర్‌నగర్ గ్రామ శివారులోకి రాగానే, అదుపు తప్పి, రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో కారు నడుపుతున్న శివ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అరుణ్, రవళి, సాయిరెడ్డి, శివకుమార్, చిన్నారులు శివానంద్, ఆరాధ్య గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో కామారెడ్డి జిల్లా దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు

మహిళను కాపాడిన ఎస్సైలు

డిచ్‌పల్లి, జూలై 16 : మండలంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ మహిళ బాసర వంతెన వద్ద ఆత్మహత్యకు యత్నించగా.. డిచ్‌పల్లి, బాసర ఎస్సైలు సకాలంలో స్పందించి కాపాడారు. గాంధీనగర్‌కు చెందిన ఓ మహిళ ఆర్థిక ఇబ్బందుల కారణంగా మంగళవారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయింది. బాసరకు చేరుకొని తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. దీంతో కుటుంబీకులు వెంటనే డిచ్‌పల్లి ఎస్సై మహేశ్‌కు సమాచారం అందించారు. దీంతో ఎస్సై సదరు మహిళ ఫోన్‌నంబర్‌కు కాల్ చేయగా రిసీవ్ చేయకపోవడంతో మొబైల్ ట్రాకింగ్ ద్వారా బాసర వంతెన వద్ద ఉన్నట్లు గుర్తించి అక్కడి ఎస్సై గణేశ్‌కు సమాచారం అందించారు. దీంతో బాసర ఎస్సై వెంటనే అక్కడికి వెళ్లి మహిళను గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

నగరంలో సైబర్ మోసం

- విద్యుత్ ఉద్యోగి ఖాతా నుంచి డబ్బులు మాయం
- రూ.65 వేలు కాజేసిన వైనం
- సైబర్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

వినాయక నగర్, జూలై 16: జిల్లాలో కొన్నిరోజులుగా జరుగుతున్న సైబర్ మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యం ఏదోఒకచోట సైబర్‌మోసాలకు బలవుతున్నారు. తాజాగా విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న ఉద్యోగికి టోకరా వేశారు. ఆయన బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయమవడం మంగళవారం వెలుగు చూసింది. బాధితుడు రత్నాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రత్నాకర్‌కు నగరంలో పెద్దబజార్‌లోని యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. ఖాతాలోంచి రూ.65 వేలు డ్రా చేసినట్లు రత్నాకర్ ఫోన్‌కు మెస్సేజ్ రావడంతో మంగళవారం బ్యాంకు అధికారులను ఆశ్రయించి విషయం తెలిపాడు. దీంతో వారు ఆయన అకౌంట్ లావాదేవీల స్టేట్‌మెంట్ తీసి ఇవ్వగా అందులో డబ్బులు డ్రా చేసినట్లు ఉంది. రెండు రోజులుగా తన ఫోన్ నంబర్‌కు ఓటీపీలు వస్తున్నాయని, అలా వచ్చిన ఓటీపీలను తాను ఎవరికీ చెప్పలేదని, తాను ఎలాంటి లింకులను కూడా ఓపెన్ చేయలేదని బాధితుడు వాపోయాడు. తన ఖాతాలో నుంచి తన ప్రమేయం లేకుండా డబ్బులు డ్రా కావడంతో ఆవేదన వ్యక్తంచేశాడు. అతడి లావాదేవీల స్టేట్‌మెంట్‌ను పరిశీలించిన బ్యాంకు అధికారులు.. ఈ విషయంలో తాము ఎలాంటి సహాయం చేయలేమని తెలిపారు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

తను మోసపోయన్నట్లు చూపుతున్న బాధితుడు

ఆలయాల్లో చోరీకి పాల్పడిన వ్యక్తికి జైలుశిక్ష

శక్కర్‌నగర్, జూలై 16: ఎడపల్లి మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో రెండు ఆలయాల్లో చోరీకి పాల్పడిన వ్యక్తికి బోధన్ న్యాయమూర్తి ఈ.సాయి శివ ఎనిమిది నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళ్‌పాడ్ గ్రామంలోని బాల త్రిపుర సుందరీదేవి ఆలయం, చెరువు కట్టపై ఉన్న గంగమ్మ గుడి ఆలయాల్లో హుండీలను గుర్తు తెలియని వ్యక్తి ఏప్రిల్ 13న రాత్రి చోరీకి పాల్పడ్డాడు. 14న ఉదయం బాల త్రిపుర సుందరీదేవి ఆలయంలో హుండీ కనిపించకపోవడం, తాళాలు పగులగొట్టి ఉండడాన్ని పూజారి జంగం సదానంద్ గుర్తించి ఆలయ ధర్మకర్త కుంటి శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. కుంటి శ్రీనివాస్ పరిసర ప్రాంతాలు గాలించగా ఓ ఇంటి ఎదుట హుండీ పగులగొట్టి కనిపించింది. ఈ హుండీలో సుమారు రూ. 25వేల వరకు చోరీ జరిగినట్లు గుర్తించారు. అదే రోజు రాత్రి చెరువు కట్టపై గంగమ్మగుడి హుండీని పగులగొట్టి చోరీకి పాల్పడ్డాడు. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డికి ఫిర్యాదు అందగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. 14న ఉదయం ఎడపల్లి బస్టాండ్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. చోరీలకు పాల్పడినట్లు నిందితుడు నేరం ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించారు. నిందితుడు మహారాష్ట్రలోని కొండల్‌వాడీ గ్రామానికి చెందిన గణేశ్ నర్సింహులు జిట్టావార్‌గా గుర్తించారు. విచారణ చేపట్టిన పూర్తి వివరాలను ఎడపల్లి పోలీసులు కోర్టుకు సమర్పించారు. గణేశ్ చోరీలకు పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో మంగళవారం న్యాయమూర్తి జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసుల తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి వాదించారు. కేసులో బోధన్ రూరల్ సీఐ కోల నరేశ్, కోర్టు లైజన్ అధికారులు బాధ్యతలు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

• స్విగ్గీ, జొమాటోలో మద్యం డోర్ డెలివరీ!

న్యూఢిల్లీ, జూలై 16: నచ్చిన ఫుడ్‌ను స్విగ్గీ, జొమాటోలలో తెప్పించుకున్నట్టే.. ఇకపై మద్యాన్ని (పరిమిత స్థాయిలో) కూడా డోర్ డెలివరీ ద్వారా తెప్పించుకునే రోజు త్వరలో రాబోతున్నది. మనకు నచ్చిన మద్యం బ్రాండ్‌ను ఆన్‌లైన్ యాప్‌లో ఆర్డర్ చేసి పొందవచ్చు! న్యూఢిల్లీ, కర్ణాటక, హర్యానా, పంజాబ్, తమిళనాడు, గోవా, కేరళలలో పైలట్ ప్రాజెక్ట్ కింద అమలుజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ-కామర్స్ సంస్థలతో మద్యం తయారీ కంపెనీలు చర్చలు జరుపుతున్నాయని పరిశ్రమ వర్గాలు మంగళవారం మీడియాకు వెల్లడించాయి.

• భారత మార్కెట్‌లోకి ఒబెసిటీ డ్రగ్ టర్‌జెపటైడ్!

న్యూఢిల్లీ, జూలై 16: బరువు తగ్గటంలో అద్భుత ఔషధంగా భావిస్తున్న 'టర్‌జెపటైడ్' ఔషధం.. త్వరలో భారత్‌లోనూ అందుబాటులోకి రాబోతున్నది. భారత్‌లో ఈ ఔషధం అమ్మకాలకు సంబంధించి ఫార్మా కంపెనీ 'ఇలి లిల్లీ'కి కేంద్రం త్వరలోనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నది. ఈ ఔషధాన్ని ఇండియాలో టైప్-2 డయాబెటిస్ రోగుల చికిత్స కోసం ప్రధానంగా వాడాలని సూచిస్తున్నా, ఒబెసిటీతో బాధపడుతున్న వారికి దీనిని ఉపయోగించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ ఔషధాన్ని పెద్ద మొత్తంలో తీసుకున్న రోగుల్లో సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయని ప్రపంచవ్యాప్తంగా జరిగిన క్లినికల్ ట్రయల్స్ చెబుతున్నాయి. భారత్‌లోని డ్రగ్ రెగ్యులేటరీ నిపుణుల కమిటీ కొద్ది రోజుల క్రితం 'టర్‌జెపటైడ్' ఔషధం అమ్మకాలకు ప్రాథమికంగా ఆమోదం తెలిపినట్టు సమాచారం.

• అనారోగ్యకర ఆహారాన్ని నిషేధించండి: యూజీసీ

న్యూఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థలలో అనారోగ్యకరమైన ఆహార పదార్థాల అమ్మకాన్ని నిషేధించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం దేశంలో అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల కారణంగానే ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయం, మధుమేహం వంటి వ్యాధులతో బాధపడుతున్నారని ఐసీఎంఆర్ నివేదికలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. వీటితో పాటు పలు అసంక్రమిత వ్యాధులకు కూడా ఇవి హేతువుగా మారుతున్నాయని తెలిపింది.

• డ్యూటీలో ముస్లింలు గడ్డంతో ఉండటం తప్పుకాదు

చెన్నై: మతాచారాలకు అనుగుణంగా గడ్డం కలిగి ఉండటం తప్పేమీ కాదని, అలా ఉన్న పోలీసులపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు చేపట్టవద్దని మద్రాస్ హైకోర్టు తమిళనాడు పోలీస్ శాఖను ఆదేశించింది. ఈ సందర్భంగా న్యాయస్థానం 1957 మద్రాస్ పోలీస్ గెజిట్ 1957ను ప్రస్తావిస్తూ ముస్లింలు విధి నిర్వహణలో గడ్డాలతో ఉండవచ్చునని, అయితే కత్తిరించిన, చక్కనైన గెడ్డాలతో ఉండాలని ఆదేశించింది. మక్కా నుంచి వచ్చిన తర్వాత గెడ్డంతో డ్యూటీకి హాజరైన ఒక కానిస్టేబుల్‌పై అధికారులు చర్య తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు గడ్డంతో విధులకు హాజరవ్వటంలో ఎలాంటి తప్పులేదని స్పష్టం చేశారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

PUB/0687

No. Y/C. 79/Catg/e-Auction/2024 తేది: 16-07-2024

దక్షిణ మధ్య రైల్వేలోని హైదరాబాద్ డివిజన్‌లో దిగువ తెలిపిన ప్రదేశాల కొరకు ఇ-వేలం ద్వారా టెండర్లు కోరుటకు సంబంధించిన ఆక్షన్ కేటలాగ్ దిగువ ఇవ్వబడినది.

క్ర.సం.	కేటగిరి	కేటలాగ్ నం.	వివరాలు	వేలం తేది	వేలం ప్రారంభ సమయం	వేలం ముగింపు సమయం
1	మల్టీపూర్ పోస్ స్టాల్స్	HYB-CATG-MPS-01	కాచిగూడ కర్నూలు సిటీ బాసర	31/07/24	11:00	11:50
2	పార్కింగ్	HYB-PRKG-037	04 స్టేషన్లు అనగా మలక్‌పేట్ (మెయిన్) అక్కన్నపేట్, గుండ్ల పోచంపల్లి & సఫిల్ గూడ రైల్వే స్టేషన్ల వద్ద పార్కింగ్ లాట్లు ఇచ్చుట	27/07/24	11:00	12:00
3	పార్కింగ్	HYB-PRKG-036	సిద్దిపేట రైల్వే స్టేషన్ వద్ద పార్కింగ్ లాట్ ఇచ్చుట	24/07/24	11:00	11:30

A0876

సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్/హైదరాబాద్

మళ్లీ చలో ఢిల్లీ

మరోసారి ఢిల్లీ ర్యాలీకి సిద్ధమైన రైతు సంఘాలు

శంభు వద్ద బారికేడ్లను తొలగించగానే ముందుకు

డిమాండ్లు సాధించే వరకు ఉద్యమం ఆపేది లేదు

బీకేయూ నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ స్పష్టీకరణ

చండీగఢ్/ఛత్రపతి శంభాజీనగర్, జూలై 16: దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతుల 'ఢిల్లీ చలో' సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో హర్యానాలో అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లు, ఇతర దిగ్బంధనాలను తొలగించిన తర్వాత.. మరోసారి ఢిల్లీకి ర్యాలీ చేపట్టేందుకు రైతు సంఘాలు సిద్ధమయ్యాయి. శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిని తెరిచిన వెంటనే రైతులు మళ్లీ చలో ఢిల్లీ చేపడుతారని భారతీయ కిసాన్ యూనియన్ ఏక్తా సిద్ధూపూర్, సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్) నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ మంగళవారం వెల్లడించారు. పంటలకు కనీస మద్దతు ధర, ఇతర డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు రైతాంగ ఉద్యమం ఆగేది లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని శంభు సరిహద్దు వద్ద రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లో తొలగించాలని పంజాబ్-హర్యానా హైకోర్టు ఇటీవల హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో దల్లేవాల్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఫిబ్రవరిలో ఎస్కేఎం(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం) ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో'ను పోలీసులు పంజాబ్-హర్యానాలోని శంభు సరిహద్దు వద్ద అడ్డుకోవడంతో ఆ నెల 13 నుంచి రైతులు అక్కడే బైఠాయించి ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో..

ర్యాలీగా ఢిల్లీ చేరిన తర్వాత జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో శాంతియుత ఆందోళనలు కొనసాగిస్తామని జగ్జిత్ సింగ్ దల్లేవాల్ వెల్లడించారు. బారికేడ్ల తర్వాత తాము కొనసాగించే ర్యాలీని మళ్లీ అడ్డుకొన్నా, రోడ్డును దిగ్బంధించినా ప్రభుత్వానిదే బాధ్యత అని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చిలో ఆందోళనల సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన నవదీప్ సింగ్‌కు సంఘీభావంగా బుధ, గురువారాల్లో శాంతియుత ఆందోళనలు చేపడుతామని తెలిపారు. నవదీప్ సింగ్‌పై పోలీసులు అల్లర్లు, హత్యాయత్నం వంటి తీవ్రమైన అభియోగాలు మోపారు. హైకోర్టు ఆదేశాలను హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయడంపై దల్లేవాల్ స్పందిస్తూ.. రోడ్డును బ్లాక్ చేసింది ప్రభుత్వమేనని, రైతులు కాదని అన్నారు. ఫిబ్రవరిలో రైతులు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణల్లో మరణించిన రైతు శుభకరణ్ సింగ్ మృతిపై దర్యాప్తునకు ఏర్పాటు చేసిన కమిటీపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

ఎంఎస్పీ పెంచక ఇబ్బందుల్లో చక్కెర పరిశ్రమ

కేంద్ర ప్రభుత్వం గత ఐదేండ్లుగా మద్దతు ధరను పెంచకపోవడంతో దేశంలోని చక్కెర పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని షుగర్ యూనిట్స్ ఫెడరేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్ డైరెక్టర్ జైప్రకాశ్ దండేగోంకర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్రం త్వరితగతిన నిర్ణయాలు తీసుకోకపోవడంతో షుగర్ ఇండస్ట్రీలో వర్కింగ్ క్యాపిటల్‌లో స్వల్ప మార్జిన్లు, అప్పులు వంటి సమస్యలు మళ్లీ తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం చెరకు ఎఫ్‌ఆర్‌పీని మూడుసార్లు పెంచిందని, అయితే చక్కెరకు ఎంఎస్పీని పెంచలేదని పేర్కొన్నారు. గత ఐదేండ్లుగా అన్ని రాష్ట్రాల ఫెడరేషన్లు డిమాండ్ చేస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేదని విమర్శించారు. చెరకు, రవాణా, లేబర్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో చక్కెర ఉత్పత్తి ఖర్చుగా కేజీకి కనీసం రూ.41 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఒమన్ తీరంలో ఓడ బోల్తా

- 16 మంది ఆచూకీ గల్లంతు
- వీరిలో 13 మంది భారతీయులు

మస్కట్, జూలై 16: ఒమన్ తీరంలో చమురు ట్యాంకర్లతో ప్రయాణిస్తున్న ప్రెస్టీజ్ ఫాల్కన్ అనే ఓడ సోమవారం బోల్తా పడింది. ఈ ఓడలో ఉన్న 16 మంది సిబ్బంది గల్లంతయ్యారని ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్(ఎంఎస్‌సీ) తెలిపింది. ఇందులో 13 మంది భారతీయులు కాగా, మరో ముగ్గురు శ్రీలంకకు చెందిన వారుగా గుర్తించారు. వీరి ఆచూకీ కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నది. కొమొరోస్‌కు చెందిన ఈ ఓడ యెమన్‌లోని ఓడరేవు నగరమైన ఏడెన్‌కు వెళ్తున్నట్టు తెలిసింది. రాయ్ మద్రకహ్‌కు ఆగ్నేయం వైపు 25 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగింది. ఓడ బోల్తా పడటానికి కారణం ఇంకా తెలియరాలేదు. ఓడ ఆచూకీ కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి.

మస్కట్‌లో మసీదు వద్ద కాల్పులు.. భారతీయుడు మృతి

మసీదు లక్ష్యంగా ఒమన్ రాజధాని మస్కట్‌లో దుండగులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఒకరు భారతీయుడు, నలుగురు పాకిస్థానీయులు ఉన్నారు. కాల్పులకు పాల్పడ్డ వారిలో ముగ్గురు దుండగులను కాల్చి చంపినట్టు పోలీసులు తెలిపారు. వాడీ కబీర్ ప్రాంతంలోని ఇమామ్ అలీ మసీద్ బయట సోమవారం రాత్రి స్థానికులు మతపరమైన వేడుక జరుపుకుంటుండగా ఈ కాల్పులు జరిగాయి. మృతి చెందిన భారతీయుని కుటుంబానికి సహాయ సహకారాలను అందించనున్నట్టు భారత రాయబార కార్యాలయం పేర్కొంది.

కూలీలుగా వేషం మార్చి.. దొంగల ముఠా ఆట కట్టించి

- పుణె పోలీసుల రహస్య ఆపరేషన్
- చోరీకి గురైన 100 బైకులు స్వాధీనం

ముంబై, జూలై 16: వ్యవసాయ కూలీలుగా మారు వేషం ధరించిన పోలీసులు, పుణె చుట్టుపక్కల వాహనాల్ని దొంగలిస్తున్న ముఠాను అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. గత ఏడాది మార్చి-ఏప్రిల్‌లో పుణె పోలీస్ క్రైం బ్రాంచ్‌లోని ఏడుగురు సభ్యులు రహస్య ఆపరేషన్ చేపట్టి.. దొంగల ముఠాలో ప్రధాన వ్యక్తి అజయ్ రమేశ్ షిండేను పట్టుకున్నారు. దొంగతనం చేసిన 100 బైకులను స్వాధీనం చేసుకొని.. నెల రోజులపాటు ఆరా తీయగా, ఓ కామర్స్ గ్రాడ్యుయేట్ నేతృత్వంలో నలుగురు వ్యక్తులు గ్యాంగ్‌గా ఏర్పడి చేస్తున్న తతంగం బయటపడింది. దొంగలించిన వాహనాల్ని దారాశివ్, లాతూర్, బీడ్ జిల్లాల్లో గ్రామస్థులకు అమ్ముతున్నట్టు పోలీసు విచారణలో తేలింది. రహస్య ఆపరేషన్‌లో భాగంగా కూలీలుగా మారిన పోలీసులు.. పొలాల్లో వంట చేసుకుంటూ, స్థానికులతో కలిసి కొన్ని సార్లు కూలి పనులకు కూడా వెళ్లారని తెలిసింది.



యూపీలో ముదురు జంట ప్రేమ

10 మంది పిల్లలున్న వ్యక్తితో ఆరుగురు సంతానం ఉన్న మహిళ జంప్

కాస్‌గంజ్: ప్రేమ గుడ్డిది అంటుంటారు. ఇది యువత విషయంలో నిజమైనా.. తాము కూడా తక్కువ కామని యూపీలో ఒక ముదురు ప్రేమజంట నిరూపించింది. సాక్షాత్తూ పెళ్లయ్యి 10 మంది పిల్లలున్న వ్యక్తి... పెళ్లయ్యి ఆరుగురు సంతానం ఉన్న మరో మహిళతో కలిసి ప్రేమాయణం సాగించి ఇద్దరూ జంప్ కావడం ఆశ్చర్యమైతే.. ఆ మహిళ తన కుమారుడి కాబోయే అత్త కావడం మరో ట్విస్టు. యూపీలోని కాస్‌గంజ్‌లో కూలిపని చేసుకునే వ్యక్తి, ఈ-రిక్షా డ్రైవర్‌గా చేసే షకీల్ 28 ఏండ్లుగా స్నేహితులు. తన కుమారుడికి అతని కుమార్తెనిచ్చి చేద్దామని షకీల్ అడగడంతో ఆయన కూడా అంగీకరించాడు. జూన్ 17న వివాహం చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో షకీల్, స్నేహితుని భార్య తరచూ మాట్లాడుకునే వారు. ఈ లోగా ఇరు కుటుంబాలకు షాక్ ఇస్తూ జూన్ 3న షకీల్, పెళ్లికుమార్తె తల్లి(35) లేచిపోయారు. 10 మంది సంతానం ఉన్న షకీల్, ఆరుగురు పిల్లలున్న పెండ్లి కుమార్తె తల్లి ఇలా చేయడం చూసి బంధువులు, చుట్టుపక్కల వారు ముక్కున వేలుసుకున్నారు. కాగా, పెండ్లి కుమార్తె తండ్రి పోలీసులకు